## హయత్‌నగర్ పోలీసులకు గుర్తుతెలియని బాలుడు లభ్యం



**దశ, హయత్ నగర్ :** హయత్నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని బాలుడు లభ్యమైన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, ఈ నెల 10వ తేదీ ఉదయం సుమారు 9 గంటల సమయంలో హయత్‌నగర్ ప్రాంతంలో సుమారు 12 సంవత్సరాల వయస్సు గల మల్లేష్ అనే బాలుడు ఒంటరిగా సంచరిస్తూ కనిపించాడు. బాలుడిని పోలీసులు విచారించగా తన ఇంటి చిరునామా, తల్లిదండ్రుల వివరాలు లేదా కుటుంబ సభ్యుల సమాచారం చెప్పలేకపోయినట్లు తెలిపారు. బాలుడి భద్రత, సంరక్షణ దృష్ట్యా అతడిని బాయ్స్ చిల్డ్రన్ హోమ్ కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ బాలుడి గురించి లేదా అతని కుటుంబ సభ్యుల గురించి ఎవరికైనా సమాచారం తెలిసి ఉంటే వెంటనే హయత్నగర్ పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## కందాల లక్ష్మి మృతి పట్ల నివాళి





**దశ, నకిరేకల్:** నకిరేకల్ నియోజకవర్గ కేంద్రానికి చెందిన ప్రముఖ విద్యావేత్త, ఏవీఎం విద్యాసంస్థల అధినేత కందాల పాపిరెడ్డి సతీమణి కందాల లక్ష్మి మృతిచెందడం పట్ల ఎమ్మెల్యే వీరేశం సహా పలువురు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారి నివాసానికి చేరుకున్న ఎమ్మెల్యే వీరేశం, కందాల లక్ష్మి గారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కందాల లక్ష్మి గారి మరణం కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఎమ్మెల్యే ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నాచారం హెచ్ఎంటి డివిజన్ నుండి మోడీ సభకు భారీగా తరలి వెళ్లిన బిజెపి శ్రేణులు పోతదాని గోపాల్ గౌడ్



**దశ ఓయూ:** సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో విశ్వగురు, ప్రపంచ నాయకుడు, జన నేత దేశ ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభకు నాచారం hmt నగర్ డివిజన్ నుండి భారీ సంఖ్యలో తరలి వెళ్తున్న స్థానిక మహిళలు యువకులు, నాయకులు, కార్యకర్తలు. జిల్లా అధికార ప్రతినిధిపోతగాని గోపాల్ గౌడ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ చంద్రమౌళి, యోగేశ్వర్ రెడ్డి, గడ్డం రాజిరెడ్డి, గంధ మల్ల గోపి, మోరా నరసింహారెడ్డి, రమేష్, సురేందర్, శేఖర్ గుప్తా, వేణుగోపాల్, క్రాంతి కుమార్, పోతగాని విజయలక్ష్మి, డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు మంజులవాని, కళావతి, పార్వతి, మీరా, సంగీత, స్వాతి, ప్రియా, కల్పన మరియు మిగతా నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చదివి వెళ్లారు

## తార్నాక వాకర్స్ సమావేశంలో ఘనంగా మోహన్రావు జన్మదిన వేడుకలు



**దశ ఓయూ:** తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యునిటీ హాల్లో ఆదివారం తార్నాక వాకర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు డా.పి. మోహన్రావు బర్త్ డేను పురస్కరించుకుని వాకర్స్ ఆధ్వర్యంలో మోహన్రావును ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ అభివృద్ధికి మోహన్రావు అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి రామ్మోనెడ్డి, రామేశ్వర్రావు, సుజాత, తదితరులున్నారు.

# ప్రపంచ పరిశోధకులను ఆకట్టుకున్న SMMCT-2026






- *శ్రేయాస్ ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు విజయవంతం.*
- *AI, మ్యాథమెటికల్ మోడలింగ్, కంప్యూటేషనల్ టెక్నిక్స్‌పై విశ్లేషణాత్మక చర్చలు*

**దశ, హైదరాబాద్:** శ్రేయాస్ ఇన్స్టిట్యూట్ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో మే 8,9 తేదీల్లో నిర్వహించిన "సస్టైనబుల్ మ్యాథమెటికల్ మోడలింగ్ అండ్ కంప్యూటేషనల్ టెక్నిక్స్ (SM MCT-2026)" అంతర్జాతీయ సదస్సు ఘన విజయాన్ని సాధించింది. దేశ విదేశాల నుంచి పరిశోధకులు, శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులు, విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేశారు. ఆధునిక సాంకేతిక రంగాల్లో పరిశోధనలకు ఈ వేదిక కీలకంగా నిలిచింది. సదస్సులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మ్యాథమెటికల్ మోడలింగ్, కంప్యూటేషనల్ టెక్నిక్స్, డేటా సైన్స్, సస్టైనబుల్ ఇంజినీరింగ్ తదితర విభాగాలకు సంబంధించిన అనేక పరిశోధనా పత్రాలు సమర్పించబడ్డాయి. సాంకేతిక సెషన్లలో పాల్గొన్న ప్రతినిధులు తమ పరిశోధన ఫలితాలను ప్రదర్శించి, భవిష్యత్ సాంకేతిక దిశలపై అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రొఫెసర్ . సి .బి .కే . ఉద్గాత, డాక్టర్ . వీ . కామాక్షి ప్రసాద్ విద్యార్థులు, పరిశోధకులను ఉద్దేశించి ప్రసంగించారు. సస్టైనబుల్ టెక్నాలజీ, అంతరశాఖ పరిశోధనల ప్రాధాన్యతను వారు వివరించారు. సాంకేతిక అభివృద్ధిలో పరిశోధనల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. భారతదేశం మరియు విదేశాల నుంచి పాల్గొన్న సుమారు 10 మంది ప్రముఖ కీనోట్ స్పీకర్లు హై పర్ఫార్మెన్స్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటేషనల్ రీసెర్చ్, మ్యాథమెటికల్ మోడలింగ్ వంటి అంశాలపై ప్రత్యేక ఉపన్యాసాలు అందించారు. వారి ప్రసంగాలు పరిశోధకులకు కొత్త ఆలోచనలకు దారితీశాయి. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఏ. హ్రిదయ్ రెడ్డి, ప్రిన్సిపాల్ సి. ఉదయ్ కిరణ్ , విభాగాధిపతులు, డీన్లు, అధ్యాపకులు, నిర్వాహక బృంద సభ్యులు పాల్గొన్నారు. సదస్సు విజయవంతం కావడంపై నిర్వాహకులను అభినందించారు. పరిశోధకులకు పరస్పర జ్ఞాన వినిమయం, పరిశోధనా సహకారం, అంతర్జాతీయ అకాడమిక్ సంబంధాల విస్తరణకు ఈ సదస్సు సమర్థవంతమైన వేదికగా నిలిచిందని కళాశాల యాజమాన్యం పేర్కొంది.

## ఇక పై ప్రతి సోమవారం రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం

- *డివిజన్ స్థాయి అధికారులు ప్రజావాణి కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలి*
- *డివిజన్ పరిధిలోని ప్రజలు వారి సమస్యలను ఆర్ డి ఓ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో సమర్పించవచ్చు*



**దశ సూర్యాపేట ప్రతినిధి :** ఇక పై ప్రతి సోమవారం ఆర్ డి ఓ కార్యాలయాలలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ స్థాయి ప్రజావానికి అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన ఆర్డీఓ లను ఆదేశించారు. ఇప్పటివరకు జిల్లా కేంద్రంలో మాత్రమే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతున్నదని, అయితే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇక పై ప్రతి సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని స్పష్టం చేశారు. డివిజన్ సాయి ప్రజావాణి కార్యక్రమానికి రెవెన్యూ డివిజనల్ అధికారి వ్యవహరిస్తారని తెలిపారు. డివిజన్ పరిధిలోని డివిజనల్ అధికారులు అందరూ డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కావాలని ఆదేశించారు.

## వడ్డెర కార్పొరేషన్ చైర్మన్‌గా గుంజ రేణుక నియామకంపై మనికేశ్వరి నగర్ లో ఘన సంబరాలు



**దశ ఓయూ:** తెలంగాణ రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్మన్‌గా గుంజా రేణుకను రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో నియమించడంపై సీతాఫల్‌మండి డివిజన్ మాణిక్యేశ్వరి నగర్ కమాన్ వద్ద వడ్డే ఓబన్న ఉత్సవ కమిటీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ డిసిసి ప్రధాన కార్యదర్శి గండికోట కుమార్ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేసి, బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమానికి సికింద్రాబాద్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆధం సంతోష్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై గండికోట కుమార్ తో కలిసి సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఎన్నో సమస్యలు ఉన్నాయని వాటిని పాదయాత్రలు చేస్తూ ఒక్కొక్కటిగా తీర్చేందుకు ప్రయత్నిస్తున్నానని తెలిపారు. ముఖ్యంగా సీతాఫల్మండి లోని ప్రభుత్వ కళాశాల పనులను వేగవంతం చేసేందుకు ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలవడం జరిగిందన్నారు. కళాశాల పనుల నిమిత్తం 30 కోట్లు నిధులు త్వరలో మంజూరు అయ్యేవిధంగా కృషి చేస్తానని హామీనిచ్చారు. అనంతరం గండికోట కుమార్ మాట్లాడుతూ వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే ప్రజల సంక్షేమం కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వడ్డెరలను కేవలం ఓట్ల కోసమే ఉపయోగించుకున్నారని, వారి సంక్షేమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్దికాలంలోనే వడ్డెర కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో డిసిసి జనరల్ సెక్రెటరీ బోదాసు నరసింహ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేముల శ్రీనివాస్, గణేష్, బొంతు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక" పేరుతో 99 రోజుల ప్రత్యేక కార్యక్రమం




**దశ ఓయూ:** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" పేరుతో 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా నాచారంలో పలుచోట్ల పేరుకపోయిన మట్టి కుప్పలను, చెత్తకుప్పలను వ్యర్థాలను తొలగించారు. నాచారం లో పలు కాలనీలలో రోడ్లపై చెత్త సేకరణ సక్రమంగా జరగకపోవడం వల్ల రోడ్లు, కాలనీల్లో చెత్త కుప్పలు పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది, దీనివల్ల దోమలు, ఈగలు పెరిగి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి రోగాలు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డికి నాచారం డివిజన్ కాంగ్రెస్ నేతలు విజ్ఞప్తి చేయడంతో ఆయన మున్సిపల్ అధికారులకు సూచించడంతో గత రెండు రోజులుగా నాచారం డివిజన్ లో మున్సిపల్ సిబ్బంది రోడ్లపై పేరుకపోయిన మట్టి కుప్పలను , వ్యర్థాలను తొలగించారు.

## ఇక నుంచి డిఎస్పీ కార్యాలయాల్లో కూడా పోలీసు ప్రజావాణి కార్యక్రమం


*పిర్యాదుదారులు, బాధితులు సద్వినియోగం చేసుకోవాలి*

**దశ సూర్యాపేట ప్రతినిధి :** ఇక పై ప్రతి సోమవారం డివిజన్ పరిధిలోని ప్రజలు వారి సమస్యలను డిఎస్పీ కార్యాలయంలో నిర్వహించే పోలీస్ ప్రజావాణి కార్యక్రమంలో డిఎస్పీ లకు పిర్యాదులు చేయొచ్చు. ఇక పై ప్రతి సోమవారం కోదాడ, సూర్యాపేట డిఎస్పీ కార్యాలయాలలో పోలీస్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. డిఎస్పీ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయాలని డీఎస్పీలు లను ఎస్పి ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహిస్తున్న పోలీస్ ప్రజావాణి కార్యక్రమం డిఎస్పీ కార్యాలయాల్లో కూడా నిర్వహించడం జరుగుతున్నదని అన్నారు. పిర్యాదుదారుల సౌలభ్యం, ప్రభుత్వ ఆదేశాల మేరకు డిఎస్పీ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రజలు, బాధితులు, పిర్యాదుదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పి సూచించారు.





# ఎర్రాప్రగడ రాంమూర్తి సేవలు మరువలేనివి



- భవిష్యత్ తరాలకు మార్గదర్శి
- సాహితీరంగంలో ఆయన గొప్ప శిఖరం
- ఘనంగా స్వగతాలకు -స్వాగతాలు పుస్తక ఆవిష్కరణ



**దశ, పినపాక:** ఎర్రాప్రగడ రాంమూర్తి సేవలు మరువలేనివి పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఈనాడు జర్నలిజం స్కూల్ ప్రిన్సిపల్ నాగేశ్వరరావులు అన్నారు. ఆదివారం ఏడూళ్లబయ్యారం క్రాస్‌రోడ్ లో ఎర్రాప్రగడ రాంమూర్తి గారు రచించిన స్వగతాలకు స్వాగతాలు పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఈనాడు జర్నలిజం స్కూల్ ప్రిన్సిపల్ నాగేశ్వరరావులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో సాహితీవేత్తగా ఉండి ఈ ప్రాంతానికి ఎర్రాప్రగడ రాంమూర్తి గారు ఎంతో గొప్ప పేరు తెచ్చారన్నారు. ఆయన రచనలు, కవితల మూలంగా భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు, కవులు, రచయితలు,రాంమూర్తిగారి కుటుంబసభ్యులు, శిష్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలి

**దశ సూర్యాపేట ప్రతినిధి :** ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని రంగాలలో ఉద్యమాలు చేపట్టాలని సిపిఐ(ఎంఎల్) రెడ్ స్టార్ రాష్ట్ర కార్యదర్శి ఎం సైదయ్య, కేంద్ర కమిటీ సభ్యులు మహమ్మద్ భాష పిలుపునిచ్చారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జిల్లా తృతీయ మహాసభలను నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ 10, 11 తేదీలలో హైదరాబాద్ ఎల్బీనగర్‌లో జరిగే రాష్ట్ర మహాసభలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో అనేక ప్రజా సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారం కోసం సిపిఐ(ఎంఎల్) రెడ్ స్టార్ పార్టీ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.దేశంలో ప్రధాని నరేంద్ర మోడీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లింలు, దళితులను టార్గెట్ చేస్తుందని విమర్శించారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రభావంతో కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ విలువలను పక్కనబెట్టి మనువాదాన్ని అమలు చేయాలని కుట్ర చేస్తోందని ఆరోపించారు.

## అశ్వాపురం మండలం జగ్గారం వద్ద రోడ్డు ప్రమాదం



**దశ, అశ్వాపురం:** మండల పరిధిలోని జగ్గారం గ్రామం వద్ద ఆదివారం ప్రధాన రహదారిపై ఎదురెదురుగా రెండు బస్సుల ఢీకొన్నాయి. జగ్గారం వద్ద రోడ్డుపై ముందు ట్రావెల్ బస్సు, వెనుక ఆర్టీసీ హైర్ బస్సు వెళ్తున్నాయి. ఎదురు వైపు నుండి ఒక ట్రావెల్ బస్సు వస్తున్న సమయంలో రోడ్డుపై అకస్మాత్తుగా ఎడమ వైపు ట్రావెల్ బస్సును బస్ డ్రైవర్ ఆపేశాడు. దీంతో ట్రావెల్ బస్సు వెనక వస్తున్న ఆర్టీసీ హైర్ బస్ అకస్మాత్తుగా ట్రావెల్ బస్సును ఢీకొట్టింది. వెనుక నుండి ఢీకొట్టిన హైర్ బస్సులో ప్రయాణినిస్తున్న పదిమంది ప్రయాణికులకు స్వల్పంగా గాయాలయ్యాయి. గాయాలపాలైన ప్రయాణికులను వెంటనే మణుగూరు 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## BJP బహిరంగసభకు తరలిన మణుగూరు నాయకులు



**దశ, మణుగూరు:** హైదరాబాద్‌లో ప్రధానమంత్రి నరేంద్రమేడీ బహిరంగసభకు ఆదివారం మణుగూరు నుండి బీజేపీ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మణుగూరు పట్టణంలో మండల నాయకుల ఆధ్వర్యంలో జెండా ఊపి వాహనాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. అదేవిధంగా పినపాక నియోజకవర్గంలో పినపాక, అశ్వాపురం, బూర్గంపాడు, కరకగూడెం, గుండాల, ఆళ్లపల్లి మండలాల నుండి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివెళ్లారు.



## హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భక్తి వెల్లివిరిసింది

- శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో ఘనంగా లక్ష నాగవల్లి దళార్చన ప్రారంభం.

**దశ సూర్యాపేట ప్రతినిధి :** హనుమాన్ జయంతి పంచాహ్నిక ఉత్సవాల సందర్భంగా ఆదివారం శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో లక్ష నాగవల్లి దళార్చన (తమలపాకులతో) కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభించారు. ప్రత్యేక పూజలు, వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ కొత్త ఆంజనేయులు, ఈవో లక్ష్మణరావు, అర్చకులు ధరూరి రామానుజాచార్యులు, ధరూరి శ్రీధరాచార్యులు, ధరూరి పవన్ కుమార్ చార్యులు, ధరూరి శ్రీనాథాచార్యులు, శ్రీకాంత్ వర్ శ్రీనివాస్ చార్యులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## 30 మంది లబ్ధిదారులకు CMRF చెక్కులు అందజేసిన MLA పాయం వెంకటేశ్వర్లు



**దశ, పినపాక:** పినపాక మండలంలో వివిధ అనారోగ్య సమస్యలు మరియు అత్యవసర వైద్య చికిత్సల కోసం ఆర్థిక సహాయం అవసరమైన 30 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (CMRF) ద్వారా సుమారు రూ.15 లక్షల విలువైన చెక్కులను పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అందజేశారు. ఏడూళ్ళబయ్యారం క్రాస్ రోడ్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు లబ్ధిదారులతో వ్యక్తిగతంగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఎంతో ఉపశమనం కలిగిస్తుందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అవసరమైన ప్రతి ఒక్కరికీ సహాయం అందేలా తాను కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రాణాపాయ స్థితిలో అండగా నిలిచిన సురక్ష సేవా సంఘం



**దశ, హైద్రాబాద్ :** అత్యవసర పరిస్థితుల్లో సేవా భావంతో స్పందిస్తూ సురక్ష సేవ సంఘం మరోసారి మానవత్వాన్ని చాటింది. కరీంనగర్ జిల్లా గోదావరిఖని ప్రాంతానికి చెందిన సత్యన్నారాయణకు గుండెకు సంబంధించిన అత్యవసర శస్త్రచికిత్స అవసరమవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. నగరంలోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయనకు ఆపరేషన్ కోసం మూడు యూనిట్ల రక్తం అత్యవసరంగా అవసరమైంది. కుటుంబ సభ్యులు తెలిసిన వారి ద్వారా సురక్ష సేవా సంఘాన్ని సంప్రదించారు. సమాచారం అందుకున్న వెంటనే సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిక్కర గోపి శంకర్ యాదవ్ ఆదేశాల మేరకు సంఘ సభ్యురాలు నాగవల్లి హారతి స్పందించి రక్తదాతలను సమన్వయం చేశారు. రక్తదాతలు సాయి హరీష్, అబ్దుల్ కబీర్ , శివ కుమార్ ఆసుపత్రికి చేరుకుని రక్తదానం చేయడంతో శస్త్రచికిత్సకు అవసరమైన రక్తం సమకూరింది. అత్యవసర సమయంలో వెంటనే స్పందించి సహాయం అందించిన సురక్ష సేవా సంఘంపై బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇంటి వద్దకే పోలీస్ సేవలు.. వారంలో 111 కేసులు నమోదు

*బాధితుల గడప వద్దే ఫిర్యాదులు స్వీకరిస్తున్న సూర్యాపేట జిల్లా పోలీసులు*



**దశ సూర్యాపేట ప్రతినిధి :** బాధితులు పోలీస్ స్టేషన్ చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా "ఎఫ్ఐఆర్ ఎట్ డోర్ స్టెప్" కార్యక్రమాన్ని సూర్యాపేట జిల్లా పోలీసులు సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గడిచిన వారం రోజులలో జిల్లాలో 111 కేసులు బాధితుల ఇంటి వద్ద నుంచే నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు.తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న ఈ కార్యక్రమం ద్వారా సంఘటనలపై సమాచారం అందుకున్న వెంటనే సంబంధిత పోలీస్ అధికారులు బాధితుల ఇంటికి లేదా వారికి అనుకూలమైన ప్రదేశానికి చేరుకుని ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. అనంతరం అక్కడికక్కడే కేసులు నమోదు చేసి కేసు పత్రాలను బాధితులకు అందజేస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. మహిళలు, బాలలు, వృద్ధులపై దాడులు, రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, భౌతిక దాడులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ ఘటనలు, విద్యాసంస్థల్లో ర్యాగింగ్, బాల్య వివాహాల వంటి సంఘటనల్లో ఈ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.ప్రజలు డయల్ 100 లేదా ఫోన్ ద్వారా సమాచారం అందించి పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే కేసులు నమోదు చేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను తక్షణమే భర్తరఫ్ చేయాలి

- రేపు, ఎల్లుండి జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో బిఆర్ఎస్ పార్టీ తరఫున నిరసన కార్యక్రమాలు నిర్వహించాలి



**దశ, కొత్తగూడెం:** కేంద్ర సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమారుడు సాయి భగీరత్ ఒక మైనర్ అమ్మాయిని అత్యాచారం చేస్తే.. ఫోక్సో కేసు నమోదు అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వంగానీ, రాష్ట్ర ప్రభుత్వంగానీ దీనిపై స్పందించకపోవడం అత్యంత బాధాకరమైన విషయం. నేను బీసీ బిడ్డను అని చెప్పుకునే బండి సంజయ్ గారు మరి అత్యాచారం చేయబడిన అమ్మాయి కూడా ఒక బీసీ బిడ్డనే అన్న సంగతి ఎందుకు మరిచాడు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి, రాష్ట్ర DGP గారికి బాధిత కుటుంబానికి ఏదైనా జరిగితే మీరే పూర్తి బాధ్యత అని BRS పార్టీ తరఫున హెచ్చరిస్తున్నామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ గారిని తక్షణమే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ రేపు, ఎల్లుండి జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో నిరసన కార్యక్రమాలకు పిలుపునిస్తున్నాను.

ఈ నిరసన కార్యక్రమాలకు యువజన నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలియజేస్తున్నాను. ఈ కార్యక్రమాలలో అన్ని మండలాల అధ్యక్షులు, టౌన్ పార్టీ అధ్యక్షులు, మాజీ మున్సిపల్ చైర్మన్, కార్పొరేటర్లు, TBGKS నాయకులు, మాజీ ఎంపీపీ, మాజీ జడ్పిటిసిలు, సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ PACS అధ్యక్షులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, విద్యార్థి, యువజన నాయకులు, మాజీ వార్డు సభ్యులు, మహిళా నాయకులు, SC, ST, BC, మైనారిటీ ముఖ్య నాయకులు, సోషల్ మీడియా నాయకులు, ఉద్యమకారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.